## 10 హెచ్‌పీ మోటర్లతోటి నీళ్లు ఉంటయా..?



గోవిందరావుపేట, నవంబర్ 27 : రేవంత్‌రెడ్డికి ఎవుసం గురించి అస్సలు తెల్వదు. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే భూమిలో నీళ్లు ఒడుస్తయ్. అట్లనె ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడి కాలిపోతయి. దీని ద్వారా కరెంట్ అధికారుల చుట్టూ తిరడం వల్ల కథ మొదటికి అత్తది. ఏ రైతు కూడా ఆ మోటరు వాడడు. దీని పవర్‌కు పంటలు కూడా కొట్టుకుపోతయి. రేవంత్‌రెడ్డి పనికి మాలిన మాటలు మాట్లాడటం సరికాదు. బీఆర్ఎస్ 24గంటల కరెంట్ ఫ్రీగా ఇత్తుంటే కాంగ్రెస్ వాళ్లు ఓట్ల రాజకీయాలు చేస్తున్నరు. రైతులను అర్థం చేసుకున్న నాయకుడే సీఎం కేసీఆర్. రైతుల సమస్యలు, ఎవుసంపై కేసీఆర్‌కు ఎంతో అవగాహన ఉంది. మళ్లా ఆయనే రావాలె.

**- కొంపెల్లి కృష్ణారెడ్డి, రైతు, చల్వాయి, గోవిందరావుపేట.**

## మునుపటి కంటె కరెంట్ మంచిగుంటాంది..



వాజేడు, నవంబర్ 27 : మునుపటితో పోలిస్తే ఇప్పుడు రైతులకు కేసీఆర్ సర్కారు అందిస్తున్న కరెంట్ బ్రహ్మాండంగా ఉంటాంది. ఒక్క మోటర్‌తో పదెకరాల పంటకు తడి అందుతాంది. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి అధికార యావ తప్ప.. ఇంకోటి లేదు. 3 గంటల కరెంట్ చాలనడం దారుణం. అసలు ఆ మాట నోటికి ఎలా వచ్చింది? రైతు బిడ్డ అయితే అలా మాట్లాడడు. ప్రజలు వాళ్లను నమ్మడం లేదని ఏవేవో మాట్లాడుతున్నడు. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో వానకాలం, యాసంగి పంటలు మంచిగ పండించుకుంటున్నం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం. రైతులకు 24 గంటల కరెంటే కావాలి.

**- బోదెబోయిన నానబాబు, యువ రైతు, నాగారం, వాజేడు.**





మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఆర్వో అంకిత్

### ఎన్నికల నిర్వహణలో
## సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

- పోలింగ్ స్టేషన్లపై అవగాహన ఉండాలి
- కనీస వసతులుండేలా చూసుకోవాలి
- సమయానికి సామగ్రిని తరలించాలి
- జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, నవంబర్ 27 : ములుగు నియోజకవర్గ పోలింగ్ స్టేషన్లపై సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి సెక్టార్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమన్నారు. కనీసం మూడుసార్లు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి మౌలిక సదుపాయాలు చూసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్ క్యాస్టింగ్, ఓటర్లు, సిబ్బందికి కనీస వసతులైన విద్యుత్, తాగు నీరు, ఫర్నిచర్, టాయిలెట్స్, వీల్ చైర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. భోజన, ఇతర వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత మండల ప్రత్యేకాధికారులదన్నారు. ప్రతి సెక్టార్ అధికారికి 10 నుంచి 15 పోలింగ్ స్టేషన్లు కేటాయించామని, ఆయా కేంద్రాల్లో కనీస వసతులున్నట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి రాతలు, 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీల పోస్టర్లు, సామగ్రి ఉండకుండా పర్యవేక్షించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సెక్టార్ల వారీగా పోలింగ్ అధికారులకు సామగ్రి పంపిణీ చేసి సకాలంలో కేంద్రాలకు తరలించాలన్నారు. 30న ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డీ వేణు గోపాల్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు డీఆర్డీవో నాగపద్మజ, డీడబ్ల్యూవో ప్రేమలత, డీపీవీ వెంకయ్య, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రిటర్నింగ్ అధికారి అంకిత్, అదనపు కలెక్టర్ డీ వేణు గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.

**ప్రకటనలకు అనుమతి తప్పనిసరి**

ఈ నెల 29, 30న పత్రికల్లో జారీచేసే ఎన్నికల సంబంధిత ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీ నిబంధనల మేరకు నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెన్స్ పీరియడ్ పాటించాలన్నారు. ఈ సమయంలో ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలు లేదని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



మంగపేట : ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వెంకటాపూర్ : ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

# ముమ్మరంగా బీఆర్ఎస్ ప్రచారం

- అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరిస్తూ..
- నాగజ్యోతిని గెలిపించాలని వినతి
- నమూనా ఈవీఎంలతో అవగాహన

మంగపేట, నవంబర్ 27 : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. సోమవారం క్లస్టర్ ఇన్‌చార్జిలు వార్డుల వారీగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. సంగంపల్లి, వాడగూడెం, చుంచుపల్లి, కొత్తమల్లూరు, కొత్తూరు మొట్లగూడెం, అబ్బాయిగూడెం, జబ్బోనిగూడెం, కమలాపురం, బోరునర్సాపురం, నర్సాయిగూడెం తదితర గ్రామాల్లో నమూనా ఈవీఎంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, తోట రమేశ్, నర్సింహారావు, ప్రవీణ్, శ్రీనివాసరావు, కేశవరావు, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాపూర్‌లో..**

వెంకటాపూర్ : బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం ప్రచారం చేశారు. మండలంలోని నర్సాపూర్‌లో జడ్పీటీసీ గై రుద్రమదేవీఅశోక్, ఎంపీటీసీ గోపు స్వప్నా వాసుదేవరెడ్డి, లక్ష్మీదేవిపేటలో రాష్ట్ర నాయకుడు సూర్యనేని మురళీధర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ గోపాల్‌రావు, పాలంపేటలో జిల్లా సీనియర్ నాయకుడు మల్క రమేశ్, సర్పంచ్ డోలి రజితాశ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆకిరెడ్డి వెంకట రామ్మోహన్‌రావు, నల్లగుంటలో సర్పంచ్ మందల సుచరితా శ్రీధర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు మాడుగుల రమేశ్, సాదా యాదగిరి, వెంకటాపూర్‌లో సర్పంచ్ మెడబోయిన్ అశోక్, ఎంపీటీసీ పోశాల అనితావీరమల్లు, కూరెళ్ల రామాచారి, రామంజాపూర్‌లో ఎంపీపీ బుర్ర రజితాసమ్మయ్య, వెల్తుర్లపల్లిలో సర్పంచ్ జగన్మోహన్‌రావు ఇంటింటికీ వెళ్లి నమూనా ఈవీఎంతో ప్రజలకు అవగాహన కల్పించి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమాల్లో దావు బాబు, మూల రత్నాకర్, వకుళాభరణం శ్రీనివాస్, కారుపోతుల సత్యం, అంతటి రాము, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**తాడ్వాయిలో..**

తాడ్వాయి : గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో భాగంగా నమూనా ఈవీఎంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో యూత్ నాయకులు మనోజ్‌రెడ్డి, వంశీ, నవీన్, గంగరాజు, రంజిత్‌కుమార్, నిఖిల్, దిలీప్, ఏసుబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయి : నమూనా ఈవీఎంతో అవగాహన కల్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కేటీఆర్ రోడ్‌షోకు తరలిన శ్రేణులు

మంగపేట, నవంబర్ 27 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఏటూరునాగారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి వెళ్లారు. క్లస్టర్ల వారీగా ఇన్‌చార్జిలు వారిని తరలించారు. వారిలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, సహకార చైర్మన్ తోట రమేశ్, గుండేటి రాజుయాదవ్, నర్రా శ్రీధర్, సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, రావుల రమణ, తుక్కాని శ్రీను, వెంకట్‌రెడ్డి, వస్రాం నాయక్, ప్రశాంత్, గుడివాడ శ్రీహరి తదితరులున్నారు.



మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు తరలుతున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు



ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న ఆర్వో, సాధారణ పరిశీలకుడు

### ఈవీఎంల సప్లిమెంటరీ
## ర్యాండమైజేషన్ పూర్తి

**రిటర్నింగ్ అధికారి అంకిత్**

**ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్ ఝూ సమక్షంలో నిర్వహణ**

ములుగు టౌన్, నవంబర్ 27 : ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి అంకిత్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝూ, పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో మొత్తం 378 బ్యాలెట్ యూనిట్లు, 378 కంట్రోల్ యూనిట్లు, 424 వీవీ ప్యాట్లను పారదర్శకంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని ఆర్వో తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డీ వేణు గోపాల్, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల విభాగం సిబ్బంది, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పస్రాలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు, యువకులతో నాయకులు

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

గోవిందరావుపేట, నవంబర్ 27 : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మండల సమన్వయ కమిటీ ప్రతినిధి బూర సురేందర్ అన్నారు. మండలంలోని పస్రాలో ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ సమక్షంలో గ్రామానికి చెందిన యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. పార్టీ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కృషి చేస్తున్నారని తెలిపారు.